

సర్కారు 'వాత్సల్యం'

అభాగ్యులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మిషన్ వాత్సల్య పేరిట సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలు చేస్తుంది. 8లో▸

రంజాన్ వేళలు

గురు
ఇఫ్తార్ 6:32

శుక్ర
సహర్ 4:44

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.2 /27.8

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చాలా వరకు ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. వేడి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ సమన్వయ కర్తలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ సమన్వయకర్తను నియమించింది. ఈ మేరకు బుధవారం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం, పార్టీ పరంగా కార్యక్రమాలు, కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేయనున్నారు. సిర్పూర్ నియోజకవర్గానికి జువ్వాజి అనిల్‌గౌడ్, చెన్నూర్‌కు జి.హైమావతి, బెల్లంపల్లికి మహ్మద్ ఖలీద్, మంచిర్యాలకు వేముల కృష్ణ, ఆసిఫాబాద్‌కు రాంశెట్టి నరేందర్‌నాయుడు, ఆదిలాబాద్ వైద్యుల అంజన్‌కుమార్, అర్జుమంద్ అలీ, బోథ్‌కు బి.సత్తు మల్లేష్, నిర్మల్‌కు కామ్రే అనిల్ కుమార్, ముథోల్‌కు ఇ.వెంకట్‌రామ్‌రెడ్డి, ఖానాపూర్‌కు మాల్సూరి సత్యనారాయణ, జునైద్ మీమన్‌లను నియమించారు.

తాగునీటి పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు


క్రిష్ణ ఆదిత్య


ప్రశాంత్ జీవన్ పాటిల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేసవిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు ఐ అండ్ సీఏడీ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌ను, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కార్మిక శాఖ డైరెక్టర్ క్రిష్ణ ఆదిత్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక అధికారులు వచ్చే జూలై ముగిసే వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజువారీగా ఇంటింటికీ తాగునీటి సరఫరా, ఇబ్బందులుపై దృష్టి సారించి, సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రత్యేక అధికారులుగా ఉన్నంత కాలం సెలవులు కూడా ఉండవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇద్దరు అధికారులు గతంలో ఉమ్మడి జిల్లాలో పని చేశారు. ఇద్దరు ఐఏఎస్‌లు గతంలో ఐటీడీఏ పీవోలుగా, ఆసిఫాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు పని చేసిన అనుభవం ఉంది.

ఎన్నికల నిర్వహణలో ఏమరపాటు వద్దు


మాట్లాడుతున్న ఆర్డీవో రత్నకళ్యాణి

నిర్మల్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆర్డీవో రత్నకళ్యాణి సూచించారు. జిల్లా కేంద్రంలోని వశిష్ఠ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ సిబ్బంది శిక్షణ తరగతులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల అనుసంధానం, సాంకేతిక సమస్యలు ఎదురైనపుడు ఎలా అధిగమించాలో వివరించారు. మాక్ పోల్ నిర్వహణ, పీవో నివేదిక, మాక్ పోల్ పత్రాలు ఎలా పూరించాలో వివరించి సందేహాలు నివృత్తి చేశారు. ఆందోళన చెందకుండా సమస్యలు ఎలా పరిష్కరించాలో శిక్షణలో అవగాహన చేసుకోవాలని సూచించారు. ఇందులో తహసీల్దార్లు రాజు, జానకి, శ్రీదేవి, మాస్టర్ ట్రైనర్లు బచ్చు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఉమామహేశ్వర్, వేణు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'ఆ పార్టీలకు స్థానం లేదు'


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తెలంగాణలో స్థానం లేదని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. గంజాల్ గ్రామ ఉపసర్పంచ్ ముత్తన్న ఆధ్వర్యంలో సోన్ మండల ప్రజాపరిషత్ కోఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్ నేతృత్వంలో పలువురు బీజేపీకి రాజీనామా చేశారు. జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి శ్రీహరిరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో 6 గ్యారంటీలు అమలు చేయడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.

దారి మళ్లిస్తున్నారు!


అధికారికి ఫిర్యాదు చేస్తున్న శాకెర వీడీసీ సభ్యులు


శాకెరలో నిర్మించిన రోడ్డు, డ్రెయినేజీ

- వ్యవసాయ భూముల్లో అక్రమ లేఅవుట్లు
- అనుమతులు లేకుండానే క్రయ విక్రయాలు
- తీర్మానం లేకుండానే ఈజీఎస్ నిధులతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- శాకెరలో అనుమతి లేని నిర్మాణాలపై గ్రామస్తుల ఫిర్యాదు

నిర్మల్/సోన్: గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీల, ఇతర మౌలిక వసతుల కోసం మంజూరు చేస్తున్న ఈజీఎస్ నిధులు జిల్లాలో దారిమళ్లుతున్నాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, గ్రామాల్లో తీర్మానాలు చేయకుండానే ఇష్టారీతిన పనులు చేపడుతున్న తీరు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా సోన్ మండలం శాకెర గ్రామంలో నిధులను దుర్వినియోగం చేసేలా చేపట్టిన పనులు బయటపడ్డాయి. దీనిపై గ్రామాభివృద్ధి కమిటీ కలెక్టర్, మండల అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులపై ఆరా తీస్తున్నారు. శాకెరలో బయటపడిన వైనం ప్రస్తుతం ఉపాధి నిధులతో జిల్లాలో కొనసాగుతున్న నిర్మాణ పనుల తీరుపై అనుమానాలను పెంచుతోంది.

పట్టా భూమిలోనే..

సోన్ మండలం శాకెర గ్రామంలో ఎలాంటి అనుమతులు, గ్రామసభ తీర్మానం లేకుండానే రూ.15 లక్షల వరకు పనులు చేపట్టినట్లు వీడీసీ ఫిర్యాదు చేసింది. ఈ పనులను ఈజీఎస్ కింద చూపెడుతూ నిధులను పొందేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించింది. గ్రామంలో సదరు వ్యక్తి చేపట్టిన రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం సైతం నిబంధనలకు విరుద్ధంగా పట్టాభూముల్లో ఉన్నాయి. అలాగే రోడ్డు, డ్రెయినేజీ రెండింటి నిర్మాణం చేపట్టిన చోట ఆయన ఇల్లు మాత్రమే ఉంది. గ్రామ అవసరాలకు ఉపయోగపడుతున్న ఎస్సారెస్పీ ఉపకాలువలోకి డ్రెయినేజీ లింక్ కలుపడంపైనా గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ అధికారులను అడుగగా, ఎలాంటి అనుమతులు లేకుండానే పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టా భూముల నాలా కన్వర్షన్ లేకుండా వెంచర్లు చేసి, ఇళ్లు కట్టుకోవడం కూడా నిబంధనలకు విరుద్ధమని వారు తెలిపారు.

గ్రామాల్లో ఇష్టారాజ్యం..

ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనులపై ముందు నుంచి అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. చాలాచోట్ల నిబంధనలకు విరుద్ధంగానే పనులు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామావసరాలకు కాకుండా స్థానికంగా తమకు లబ్ధి జరిగే విధంగా ఈ పనులను చేపడుతున్నారని, సమస్యలు ఉన్నచోట నిర్మాణాలను చేపట్టడం లేదన్న వాదనలూ ఉన్నాయి. పనుల్లోనూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని, ఇష్టారీతిన చేస్తున్నారన్ని విమర్శలు వస్తున్నాయి.

రాజకీయ అండతో..

ఎలాంటి అనుమతులు లేకుండా, గ్రామ సభ తీర్మానం లేకుండా, ఈజీఎస్ నిధులను విడుదల చేయించుకునేందుకు చేస్తున్న పనులు విస్తుగొల్పుతున్నాయి. తాము ఎలా పనులు చేసినా.. నిధులు వస్తాయన్న తీరులో వ్యవహారం కనిపిస్తోంది. స్థానికంగా పలుకుబడి, రాజకీయ అండదండలు ఉంటే సరిపోతుందన్నట్లుగా కొంతమంది వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో నిబంధనలనూ పట్టించుకోవ డం లేదు. అధికారులపై రాజకీయ ఒత్తిడితో పనులు చేయించుకుంటున్నారన్న ఆరోపణలూ వస్తున్నాయి. శాకెరలో చేపట్టిన పనులు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవి. అప్పుడు ఇచ్చిన లొకేషన్ మార్చి తాజాగా పనులు చేపట్టారు. దీనిపై వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. గ్రామంలో పూర్తి విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డీఆర్డీవో, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు వారు బుధవారం సాయంత్రం గ్రామంలో విచారణ చేపట్టారు.

చర్యలు తీసుకోవాలి..

నిబంధనలు ఏమాత్రం పాటించకుండా గ్రామంలో ఈజీఎస్ నిధుల పేరిట సొంత ఇంటి కోసం రోడ్డు, డ్రెయినేజీ నిర్మించుకుంటున్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రత్యేకాధికారి, సోన్ మండలాధికారులతోపాటు కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశాం. ఈమేరకు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– శాకెర వీడీసీ

తీర్మానం ఇవ్వలేదు..

గ్రామంలో ఈజీఎస్ నిధుల పేరిట చేపట్టిన పనులకు సంబంధించి ఎలాంటి గ్రామసభ తీర్మానం, అనుమతులు ఇవ్వలేదు. పట్టా భూముల్లో నిర్మాణాల విషయంలోనూ అనుమతులు తీసుకోలేదు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. వారి ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటాం.

– ప్రియాంకరెడ్డి, శాకెర పంచాయతీ కార్యదర్శి

పంటకు బీమా.. రైతుకు ధీమా!

- రాష్ట్రంలో మళ్లీ ఫసల్ బీమా అమలు
- ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం
- వచ్చే ఖరీఫ్ నుంచి అమలుకు అధికారుల కసరత్తు

Pradhanmantri Fasal Bima Yojana

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు కేంద్రానికి చేసిన వినతికి ఆమోదం లభించింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయలేదు. దీంతో పథకం నిలిచిపోయింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఫసల్ బీమా అమలుకు చర్యలు చేపట్టింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వచ్చే వర్షాకాలం సీజన్ నుంచే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బీమా అమలు చేసేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

2016లో ప్రారంభం..

ఫసల్ బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశ పెట్టింది. దీనిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయడానికి విముఖత చూపింది. అమలు చేసి ఉంటే గడిచిన ఇన్నేళ్లలో ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన వారికి పరిహారం అందేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పంట క్షేత్రం యూనిట్‌గా..

గతంలో ప్రభుత్వం అమలు చేసిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టాన్ని అంచనా వేసేవారు. అయితే వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా కొన్నేళ్లుగా మండల వ్యాప్తంగా ఒకే రకం వాతావరణ పరిస్థితులు ఉండడం లేదు. ఒక ప్రాంతంలో భారీ వర్షం కురిస్తే మరొక ప్రాంతంలో చినుకు కూడా పడని పరిస్థితులు ఉన్నాయి. ఈనేపథ్యంలో మరోసారి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవాలనే అంశాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించినా సరిగా అమలుకు నోచుకోకపోగా అది రైతులకు న్యాయం జరగడం కంటే బీమా కంపెనీలకే ప్రయోజనం చేకూరేది. మండలాన్ని, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోకుండా పంట క్షేత్రాన్నే యూనిట్‌గా లెక్కిస్తే జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు బీమా సొమ్ము అందించినప్పుడే ఆర్థిక భరోసా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

గతంలో ఇలా..

అప్పట్లో మొక్కజొన్న పంటకు గ్రామం యూనిట్‌గా బీమా అమలు చేశారు. మిగతా పంటలకు మాత్రం మండల యూనిట్‌గా అమలు చేసేవారు. అప్పటి నిబంధనల ప్రకారం మొక్కజొన్న ఎకరాకు రూ.500, వరికి రూ.680, కందికి రూ.280, పెసర్లు రూ.300 ప్రీమియం, పత్తికి ఎకరాకు రూ.1,750 ప్రీమియం చెల్లించాల్సి ఉండేది. మూడేళ్లుగా ఈ పథకం రాష్ట్రంలో నిలిచిపోయింది. దీంతో పంటల దెబ్బతిన్నా పరిహారం అందలేదు.

భారంగా 'ప్రైవేటు' ప్రీమియం

ప్రస్తుతం జిల్లాలో కేవలం పత్తి పంటకు ఓ ప్రైవేట్ కంపెనీ బీమా అమలు చేస్తుంది. రైతులు ఈ కంపెనీ ద్వారా ఇన్సూరెన్స్ చేయించు కోవాలంటే ఎకరాకు రూ.12 వేలకు ప్రీమియం చెల్లించాలి. గతంలో ఫసల్ బీమా పథకంలో ఎకరాకు కేవలం రూ.1,750 మాత్రమే చెల్లించే వారు. కానీ నేడు పరిస్థితి భిన్నంగా మారడంతోరైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నుంచి పథకం అమలుకు నోచుకోక, సొంతంగా ప్రైవేటు కంపెనీలు ప్రీమియం చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగాలు చేపట్టి ఫలితాల ఆధారంగా బీమా చెల్లింపునకు సిఫా ర్సు చేసేవారు. ప్రస్తుత ప్రైవేట్ కంపెనీల పథకాల్లో వ్యవసాయశాఖ ప్రమేయంతో పనిలేకుండా పూర్తిగా వాతావరణ ఆధారిత విధానంలో భాగంగా రాడార్ పద్ధతిలో బీమా అమలు చే యడం క్షేత్రస్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు.

రైతులకు భరోసా కల్పించాలి..



గతంలో ప్రభుత్వాలు అమలు చేసిన పంటల బీమా పథకాలు మండలం యూనిట్‌గా తీసుకోవడంతో రైతులకు ఏనాడూ న్యాయం జరగలేదు. ఇక నుంచి మండలం, గ్రామం యూనిట్‌గా కాకుండా పంట క్షేత్రమే యూనిట్‌గా పరిగణలోకి తీసుకుని పంటల బీమాను అమలు చేస్తే రైతుకు భరోసా కలుగుతుంది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– పుప్పాల రవికుమార్, రైతు, పెంబి

అమలు చేయాలి...



రైతులకు వ్యవసాయమే ఆధారం. పంటలకు బీమా అమలు చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరిగినప్పుడు పరిహారం అందే అవకాశం ఉంటుంది. గతంలో అనేకసార్లు ప్రకతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదు. ఇప్పటికైనా బీమా అమలు చేసి రైతులను ఆదుకోవాలి.

– భూమారెడ్డి, విట్టాపూర్

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ వారియర్స్‌కి సిమ్స్, ఫోన్స్ అందిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైనప్పుడు 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల సూచించారు. సైబర్ బాధితులకు మెరుగైన సేవలు అందించేదుకు పోలీస్ స్టేషన్లలో సైబర్ వారియర్స్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఫోన్స్, సిమ్స్ కార్డులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు.. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ పోలీసు స్టేషన్‌లో సైబర్ వారి యర్స్‌ను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక ఫోన్స్, సిమ్ కార్డులు అందించామని వివరించారు. సైబర్ మో సానికి గురైనప్పుడు 1930 కి కాల్ చేసి గానీ, ఎన్సీ ఆర్పీ పోర్టల్ ద్వారాగాని ఫిర్యాదు నమోదు చేసుకో వాన్నారు. అనంతరం వారి అప్లికేషన్ స్టేటస్ తెలు సుకోవడానికి తిరిగి 1930 కాల్ చేసిన వెంబడే తమ ఏరియాలో గల సైబర్ వారియర్‌కు సులువుగా ఫోన్ కనెక్ట్ అయి తమ అప్లికేషన్ స్టేటస్ తెలుసుకో వడానికి వీలుంటుందన్నారు. జిల్లా ప్రజలు ఈ సే వలను వినియోగించుకోవాలనీ ఎస్పీ సూచించా రు. సైబర్ సెల్ ఇన్‌చార్జి డీఎస్పీ శివభాస్కర్, ఇన్స్పెక్టర్ వెంకటరమణ, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

అనారోగ్యం 'కొని' తెచ్చుకుంటున్నాం


హోటల్‌లో తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్(ఫైల్)


నల్లగా కాగిన నూనెలో వేగుతున్న సమోసాలు

- చిరుతిళ్ల పేరిట ప్రజారోగ్యంతో చెలగాటం
- కాగిన నూనె.. నాసిరకం సరుకులు
- అపరిశుభ్రం.. అనారోగ్య కారకం..
- టిఫిన్ సెంటర్ల నుంచి రెస్టారెంట్ల వరకూ అదే పరిస్థితి
- పట్టించుకోని ఆహార భద్రత అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: పొద్దుపొద్దున్నే కమ్మటి అల్పాహారం నోరూరిస్తుంది. సాయంత్రం కాగానే ఘుమఘుమలాడే స్నాక్స్ వాసనలు వస్తుంటాయి. రోడ్డుపక్కన బండి నుంచి అద్దాలమేడలో నిర్వహించే రెస్టారెంట్ల వరకు టిఫిన్స్, స్నాక్స్, భోజనం, బిర్యానీతోపాటు వివిధ రకాల వంటకాలు అమ్మకానికి అందుబాటులో ఉంటున్నాయి. ఆయా వంటకాలకు అనుగుణంగా ధరలు నిర్ణయిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. జిల్లాలోని ఆయా హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణం వినియోగదారుల అనారోగ్యానికి కారణమవుతోంది. కాగిన నూనె, నాసిరకమైన సరుకులు రోగాలు తెచ్చిపెడుతున్నాయి. మున్సిపల్, ఆహారభద్రత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అంతా అపరిశుభ్రతే..

జిల్లావ్యాప్తంగా ఉన్న హోటళ్లు కనీసం నిబంధనలు పాటించడం లేదు. వాడిన నూనె మళ్లీమళ్లీ వాడుతున్నారు. బజ్జీలు, మంచూరియా తయారీ కోసం వాడిన నూనె మరోసారి వాడొద్దు. అయితే ఈ వంటకం తర్వాత మిగిలిపోయిన నూనెతో ఇతర పదార్థాలు తయారు చేస్తున్నారు. ఇది కేన్సర్‌కు దారి తీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు అపరిశుభ్రంగానే ఉంటున్నాయి. వంటపాత్రలు శుభ్రం చేసేందుకు చాంబర్స్ ఉండాలి. కానీ వంటపాత్రలు శుభ్రం చేసేస్థలంలో కుక్కలు, పందులు సంచరిస్తున్నాయి. ఒకానొక సమయంలో ఆ పాత్రలను తాకుతుంటాయి. నిబంధనల ప్రకారం వంటమాస్టర్లు, సర్వర్లు ఆప్రాన్స్, గౌస్లు ధరించి వంట చేయాలి. కానీ జిల్లాలో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. రెస్టారెంట్లలో అయితే కొన్ని రోజులు నిల్వ చేసిన మాంసం, చట్నీలను వాడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

ఆహార భద్రత అధికారులు ఎక్కడ?

జిల్లాకు చెందిన ఆహారభద్రత అధికారులు ఎక్కడా తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం అనుమానం ఉన్న హోటళ్ల నుంచి ఆహార పదార్థాల శాంపిల్స్ తీసి హైదారాబాద్ లోని ల్యాబ్‌లోకి పంపిస్తుంటారు. వారు పరిశీలించి సబ్ స్టాండెడ్, మిస్ బ్రాండెడ్, అన్‌సేఫ్ అని రిపోర్ట్ ఇస్తారు. ఆ రిపోర్ట్ ఆధారంగా వారికి అదనపు కలెక్టర్ జరిమానాలు విధిస్తుంటారు. జిల్లాలో ఒక ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌తోపాటు, ఫుడ్ సేఫ్టీ డిసిగ్నేటెడ్ అధికారి ఉంటారు. జిల్లాలో 500 వరకు హోటల్స్, టిఫిన్ సెంటర్లు, 20 వరకు రెస్టారెంట్లు, లెక్కకు మించి టీస్టాళ్లు నడుస్తున్నాయి. ప్రజలు వివిధ అవసరాలకు పట్టణాలకు వచ్చి వెళ్తుంటారు. వీరు భోజనం కోసం హోటళ్లు, టిఫిన్ సెంటర్లను ఆశ్రయిస్తూ అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిత్యం తనిఖీలు చేపట్టి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



హోటళ్లలో వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలి. నిబంధనలు పాటించాలి. నిత్యం తనిఖీలు చేస్తున్నాం. ప్రజల దృష్టికి ఏవైనా వస్తే మాకు ఫిర్యాదు చేయాలి. కఠిన చర్యలు తీసుకుంటాం.

– సీవీఎస్.రాజు, మున్సిపల్ కమిషనర్

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ అధికారులు, పీఏసీఎస్, డీసీఎంఎస్, ఐకేపీ సంఘాలతో కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గురువారం నుండి 125 కేంద్రాలలో కొనుగోళ్లను ప్రారంభించాలని తెలిపారు. తేమశాతం 17 లోపు ఉండాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కేంద్రాలలో తాగునీరు, టెంట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ప్రతీరైతు ఆధార్, బ్యాంకు, పట్టా పాస్ బుక్ తీసుకురావాలని తెలిపారు. కేంద్రాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శ్రీకళ, నందిత, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ లక్ష్యం పూర్తిచేయాలి

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ 2023–24 సంవత్సరం లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మిల్లర్లు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సీఎంఆర్ లక్ష్యాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరంతరం మిల్లింగ్ చేయాలని, నిబంధనలు పాటించని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లుల వారీగా ధాన్యం నిల్వలపై రిపోర్టులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిలర్ల వారీగా లక్ష్యం, పూర్తిచేసిన సీఎంఆర్ సరఫరా, పెండింగ్‌పై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఎస్‌వో నందిత, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌తో కలిసి ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామన్నారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించడం జరిగిందన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 382 కంట్రోల్ యూనిట్లు, 382 బ్యాలెట్ యూనిట్లు, 413 వీవీ ప్యాట్‌లు కేటాయించగా, ఖానాపూర్ నియోజకవర్గానికి 385 కంట్రోల్ యూనిట్‌లు, 385 బ్యాలెట్ యూనిట్లు, 415 వీవీ ప్యాట్‌లను, ముథోల్ నియోజకవర్గంలో 388కంట్రోల్ యూనిట్లు, 388 బ్యాలెట్ యూనిట్లు, 419 వీవీ ప్యాట్‌లను ఆన్‌లైన్ విధానం ద్వారా ర్యాండమైజేషన్ నిర్వహించి కేటాయించడం జరిగిందని వివరించారు. మొదటి దశ ర్యాండమైజేషన్‌కు సంబంధించిన రిపోర్టు కాపీలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించామని తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రతినిధులు ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరి పాటించాలన్నారు. ప్రచారానికి, ర్యాలీలు, సభలు, సమావేశాలకు సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందాలన్నారు. నిబంధనలను పాటిస్తూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఈడీఎం నదీమ్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్


ఇఫ్తార్ విందులో అటవీ అధికారులు, ముస్లింలు

నిర్మల్ టౌన్: జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లా అటవీశాఖ కార్యాలయ సముదాయంలో ప్రభుత్వం తరపున బుధవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి సీసీఎఫ్ శర్వాణన్ హాజరయ్యారు. ఇఫ్తార్ విందులతో హిందూ, ముస్లింల మధ్య ప్రేమ భావం పెరుగుతుందన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వోలు జైపాల్‌రెడ్డి , రమేశ్‌రాథోడ్, శ్రీనివాస్‌రావు, అటవీశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు నజీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

7న గిరిజన గురుకుల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఇచ్చోడ: ఈ నెల 7వ తేదీన గిరిజన గురుకులం, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా గిరిజన గురుకులాల సమన్వయకర్త గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ, గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అశోక్‌నగర్, వరంగల్‌లోని సైనిక్ పాఠశాలలు, కళాశాలల్లో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోతరగతి ప్రవేశ పరీక్షకు 248 మంది, ఇంటర్ ప్రవేశ పరీక్షకు 152 మంది విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలోగల వాటర్ ట్యాంక్ వద్ద పేకాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. బుధవారం భాగ్యనగర్‌కు చెందిన ఐదుగురు పేకాటాడుతున్నట్లు సమాచారం రాగా దాడులు నిర్వహించి వారిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.1,010 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.


బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బేల్లూరి అయ్యప్ప ఆలయ సమీపంలో జాతీయ రహదారిపై ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై ముజిహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ నజీర్ పట్టణం నుంచి మహారాష్ట్రకు ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా బుధవారం వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆటో, బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వైద్యపోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదివరకు రిమ్స్‌కు 153 పోస్టులు మంజూరు కాగా, గతంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 23 మంది విధుల్లో చేరారని పేర్కొన్నారు. ప్రస్తుతం 130 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ కానున్న ప్రొఫెసర్ పోస్టుకు నెలకు రూ.లక్షా 90వేలు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.లక్షా 50వేలు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.లక్షా 25వేలు, సీనియర్ రెసిడెంట్‌కు రూ.92,575, ట్యూటర్‌కు రూ.55వేల జీతం ఉంటుందని పేర్కొన్నారు.

సర్కారు 'వాత్సల్యం'



- 'మిషన్ వాత్సల్య' పేరిట కొత్త పథకం
- విద్య, వైద్యానికి రూ.4వేల సాయం
- అంగన్‌వాడీల్లో దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: అభాగ్యులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మిషన్ వాత్సల్య పేరిట సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో దీన్ని అమలు చేసేందుకు ముందుకొచ్చింది. కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున అందనుంది. 18 ఏళ్ల లోపు వయస్సున్నవారు ఈ పథకానికి అర్హులు. ఒకే కుటుంబంలో ఇద్దరు పిల్లలున్నా దీనికి అర్హులే. విధి వంచిత బాలలు పేదరికం కారణంగా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అనాథలు, అభాగ్యులు బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం 2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలకార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, హెచ్ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థికసాయం అందించనున్నారు.

అర్హులెవరంటే..

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కొన్ని పరిమితులను ప్రభుత్వం విధించింది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సరాదాయం రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96వేలకు మించరాదు. 18 ఏళ్ల లోపు బాలలు దీనికి అర్హులు. బాలల సంక్షేమ కమిటీ లిఖిత పూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గృహం, బాలల సదనంలో చేర్పించిన తర్వాత సహాయాన్ని నిలిపివేస్తారు. ప్రత్యేకావసరాలు కలిగిన బాలలు మినహా పాఠశాలలకు వెళ్లేవారు. పాఠశాల హాజరు సక్రమంగా లేదని తేలినా అధికారులు పరిశీలించి సాయాన్ని నిలిపివేస్తారు.

జత చేయాల్సిన పత్రాలు..

బాలుడు/బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, తల్లి, తండ్రి ఆధార్‌కార్డులు, మరణ ధ్రువీకరణ పత్రం, సంరక్షకుడు (గార్డియన్) ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం. బాలుడు/బాలిక పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ వివరాలు లేదా బాలుడు/బాలిక వ్యక్తిగత అకౌంట్.

దరఖాస్తుల పరిశీలన ఇలా..

అర్హులు దరఖాస్తు ఫారం నింపి అవసరమైన పత్రాలు జత చేసి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇవ్వాలి. వీటిని సీడీపీవో కార్యాలయానికి పంపిస్తారు. దరఖాస్తులన్నింటినీ మండల స్థాయి స్క్రూటినింగ్ కమిటీ (తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవో, ఐసీడీఎస్ సూపర్ వైజర్‌తో కూడిన బృందం) సభ్యులు నిశితంగా పరిశీలిస్తారు. నిబంధనల మేరకు అర్హత కలిగిన దరఖాస్తులను ఎంపిక చేసి ప్రతీ దరఖాస్తుపై కమిటీ సభ్యులు సంతకం చేస్తారు. అనంతరం సదరు సమావేశం మినట్స్‌తో పాటు దరఖాస్తులన్నింటినీ జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయానికి పంపిస్తారు. వాత్సల్య పథకం ఎంపిక కోసం స్పాన్సర్‌షిప్ అండ్ పోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ (ఎస్ఎఫ్సీఏసీ) ఉంటుంది. కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



అర్హత కలిగిన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం ద్వారా 126 మందికి సాయం అందించేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటివరకు 119 మందికి పథకాన్ని వర్తింపజేస్తున్నాం. ఇంకా కొత్త వారుంటే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు రాగానే ప్రభుత్వానికి పంపిస్తాం. వచ్చిన దరఖాస్తులను స్పాన్సర్‌షిప్ అండ్ పోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ స్క్రూట్నీ చేసి అర్హులను ఎంపిక చేస్తుంది.

– నాగమణి, జిల్లా సంక్షేమాధికారి, నిర్మల్

ఇంటి వద్దకే భద్రాద్రి తలంబ్రాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సాలోమాన్

నిర్మల్ టౌన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని టీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. గతేడాది లాగే ఈసారి కూడా తెలంగాణ దేవాదాయశాఖ సహకారంతో ఈ పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టింది. ఎంతో విశిష్టత కలిగిన ఈ తలంబ్రాలు కోరుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ రీజియన్ కార్యాలయంలో బుధవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ మేనేజర్ సాలోమాన్ ఆవిష్కరించారు. తలంబ్రాల బుకింగ్ ప్రారంభించారు. భద్రాద్రిలో ఈ నెల 17న అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని విని యోగించుకోవాలని కోరారు. వివరాలకు నిర్మల్ డిపోను 9154298542, భైంసా డిపోను 9666128528 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సారంగపూర్‌లో యాచకుడి మృతి



గంగాధర్ మృతదేహం

సారంగపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి ఫర్టిలైజర్ షాపు పక్కన మృతిచెంది ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి గురించి ఆరా తీసి నిర్మల్ రూరల్ మండలం కొత్త పోచంపాడ్ గ్రామానికి చెందిన కోమ్రె గంగాధర్ (48)గా గుర్తించారు. ఈయన కొంతకాలంగా మతిస్థిమితం లేక సారంగపూర్ చేరుకుని ఇక్కడే భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని తెలిసింది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సామాజిక బహిష్కరణ బాధ్యులపై చర్య తీసుకోవాలి



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న సంఘం సభ్యులు

నిర్మల్‌టౌన్: మామడ మండలం పరిమండల్ గ్రామంలో మత్స్యకారులపై సామాజిక బహిష్కరణ విధించిన వీడీసీ సభ్యులపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని ఎస్పీ జానకీషర్మిల, డీఎస్పీ గంగారెడ్డికి ముదిరాజ్ సంఘం నేతలు బుధవారం ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి గ్రామంలోని పరిస్థితులను వివరించారు. స్పందించిన ఎస్పీ వీడీసీ సభ్యులపై చర్య తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు. ముదిరాజ్ సంఘం నేతలు ఘర్షణకు దిగొద్దని, సమస్యను పరిష్కరిస్తామని డీఎస్పీ తెలిపారు. అనంతరం ముదిరాజ్ సంఘం నేతలు మాట్లాడుతూ... చేపలు పట్టుకునే హక్కు ఉన్న ముదిరాజ్‌లను కాదని లూటీ చేసిన వీడీసీ సభ్యులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సుమారు 60 మంది ముదిరాజ్ కుటుంబాలు ఉండగా ఎవరు కూడా ఏనాడు వీడీసీతో ఘర్షణ పడలేదన్నారు. చెరువుతో ఉపాధి పొందుతున్నారనే కక్షతో ఈ విధంగా గ్రామ బహిష్కరణ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేందర్ శివయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు పాతర్ల హరీశ్, గౌరవ అధ్యక్షుడు ధర్మ చిన్నయ్య, పరిమండల్ గ్రామ మత్స్యకార సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లు యజమానిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని స్వస్తిక్ జిన్నింగ్ మిల్లు యజమాని సంతోష్ అగర్వాల్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. మిల్లులో 110 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు పేర్కొన్నారు. వాహనంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉండగా బుధవారం తనిఖీలు చేపట్టడంతో పట్టుబడినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బందిలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బపై ప్రజలకు అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీ ఆశ కార్యకర్త వద్ద, అంగన్‌వాడీ కేంద్రాల్లో, గ్రామ పంచాయతీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతకుముందు మల్లాపూర్ సబ్ సెంటర్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల పంపిణీని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్, డాక్టర్ ప్రత్యూష, హెచ్ఈవో శేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై చీటింగ్ కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ఎలుగందుల మార్కండేయ అనే యువకుడు తన బైక్ నంబర్ కనిపించకుండా మాస్క్ పెట్టినందుకు వన్‌టౌన్ పోలీసులు అతడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. బైక్ వెనుకాల గల నంబర్ ప్లేట్ కింది భాగంలో రేడియంతో 'నన్ను ఎవడ్రా ఆపేది' అని రాయించాడు. దీంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా నంబర్ కనిపించకుండా మాస్క్ పెట్టాడు. గతంలోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకోగా పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నిబంధనలు తుంగలో తొక్కి నంబర్ ప్లేట్లు కనిపించకుండా వివిధ రకాలుగా వాహనచోదకులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు.

నగదు స్వాధీనం



పట్టుకున్న నగదుతో ఎస్సై సందీప్

తానూరు: మండలంలోని జౌలా(బీ) సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తుల వద్ద రూ. 2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మహారాష్ట్రలోని రాశి గ్రామానికి చెందిన సుదర్శన్ రూ.లక్ష, తానూరు మండలం నందగాం గ్రామానికి చెందిన దేవిదాస్ రూ.1.50 లక్షలు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

కుంటాల: సూర్యాపూర్‌లో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. రూ.3,587 విలువైన 8.40 లీటర్ల మద్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు వెల్లడించారు. మద్యం విక్రయించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



పట్టుకున్న మద్యంతో పోలీసులు

దొంగ అరెస్ట్

నిర్మల్ రూరల్: మండలంలోని ముజ్గి గ్రామంలో గల మల్లన్న ఆలయంలో మంగళవారం రాత్రి ఓ దొంగ చొరబడ్డాడని, హుండీ పగులగొట్టి రూ.3,500 నగదు చోరీ చేసినట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ఆర్మూర్ పట్టణానికి చెందిన చిట్యాల రాజు గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని విచారించామన్నారు. దీంతో ఆలయంలో తానే దొంగతనం చేసినట్లు రాజు ఒప్పుకొన్నాడని ఎస్ఐ తెలిపారు. గతంలోనూ నిర్మల్ టౌన్, సారంగపూర్, లక్ష్మణచాంద, సోన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ ఆలయాల్లో ఇతడిపై దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఆదరిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

నార్నూర్: ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవ చేయడానికి ఎంపీగా పోటీ చేస్తున్నానని, ఒక్కసారి ఆదరించి ఆశీర్వదిస్తే పార్లమెంట్‌లో పేద ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకనవుతానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పేర్కొన్నారు. బుధవారం కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు లోఖండే దేవురావ్ ఇంట్లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థిగా తొలిసారిగా మండలానికి వచ్చిన సుగుణను కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా సామాజిక సేవా దృక్పథంతో ఏజెన్సీ ప్రాంతంలో అనేక కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. ఎలాంటి వర్గ విభేదాలున్నా పక్కకు పెట్టి ప్రతీ కార్యకర్త పార్టీ గెలుపునకు కృషిచేయాలని సూచించారు. నాయకులు భరత్ వాగ్మారే, బ్రిజలాల్, లోఖండే దేవురావు, చౌహాన్ దిగంబర్, ఆడే వీలాశ్, హైమద్, జక్రుల్లాఖాన్, గోవింద్ తదితరులున్నారు.

'రసాయనాలు విరివిగా వాడొద్దు'



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఆదిలాబాద్‌టౌన్: రైతులు పంట పొలాల్లో పురుగు మందులను విచ్చలవిడిగా వాడొద్దని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త రాజశేఖర్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ నాగ్‌పూర్ సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రంలో పురుగుల మందుల నిరోధక శక్తి–యాజమాన్య పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయనాలను అధిక మోతాదులో వాడడంతో దిగుబడులు తగ్గడంతో పాటు నేల సారం కోల్పోతుందని తెలిపారు. గులాబీ రంగు పురుగు ఉధృతి, తీసుకోవాల్సిన చర్యలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శిక్షణలో బుర్కపల్లి, సిర్సన్న, కారిగూడ, దైవాజీగూడ, అంకాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు. 60 మంది రైతులకు రూ.1,800 విలువైన పురుగుల మందులతో పాటు లింగాకర్షక బుట్టలు, వేప నూనె, ఇతర పురుగుల మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రవీణ్‌కుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి



హవర్గలో మట్టి తవ్వుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లోకేశ్వరం: ఉపాధి పనులు చేసే ప్రదేశాల్లో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని హవర్గ, వట్టోలి గ్రామాల్లోని ఉపాధిహామీ పనులను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ ప్రతీరోజు పనులు జరిగే ప్రదేశాలనికి వెళ్లి మాస్టర్‌రోల్‌లో సంతకాలు తీసుకోవాలన్నారు. పనులకు కూలీలు హాజరైన తరువాత వెంటనే కూలీల పనుల ఫొటోలు అప్‌లోడ్ చేయలన్నారు. పని ప్రదేశాల్లో టెంటు, మంచి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పనులకు తగినట్లుగా కూలి చెల్లిస్తామన్నారు. చెరువుల నుంచి మట్టిని రైతులు వారి పొలాల్లోకి తరలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, టీఏలు శారద, రవీందర్, మంజుల, ఎఫ్ఏ పోశెట్టి, అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

పలుగు పట్టిన డీఆర్డీవో..

మండలంలోని హవర్గ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించేందుకు వచ్చిన డీఆర్డీవో విజయలక్ష్మి పనులు సరిగా చేయాలని కూలీలకు సూచించారు. అయితే కూలీలు మట్టిని తవ్వితే గట్టిగా ఉందని సమాధానం ఇచ్చారు. దీంతో డీఆర్డీవో స్వయంగా పలుగు పట్టి మట్టి తవ్వి కూలీలకు చూపించారు. మట్టి వదులుగా ఉందని అధికారి చెప్పడంతో కూలీలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, విద్యార్థులు

నిర్మల్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్, శ్రీ గ్రీన్ వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకంతో జరిగే అనర్థాలపై జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఢిల్లీ నుండి వచ్చిన విద్యార్థులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్లాస్టిక్ పర్యావరణానికి పెనుముప్పుగా మారిందన్నారు. 5 రోజులుగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ప్లాస్టిక్ వాడకాలతో జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ సీవీఎస్.రాజు, టీపీఎస్ నవీన్, టీపీవో సుమలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘరానా మోసం

- చిట్టీల పేరిట రూ.లక్షలతో ఉడాయించిన కేటుగాడు
- లబోదిబోమంటున్న బాధితులు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటింటికీ పాలు పోస్తూ కాలనీవాసులను నమ్మించిన కేటుగాడు ఘరానా మోసానికి పాల్పడ్డాడు. వివరాలు.. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సంజయ్‌నగర్, రిక్షా కాలనీ, సుభాష్‌నగర్ తదితర కాలనీవాసులకు కొన్ని సంవత్సరాలుగా పాలు పోస్తున్నాడు. వారి దగ్గర అప్పులు తీసుకుంటూ వడ్డీ చెల్లిస్తున్నాడు. మహిళలను నమ్మబలికి వడ్డీ పేరిట వారి నుంచి నగదుతో పాటు బంగారం తీసుకున్నాడు. తిరిగి డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతుండగా బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ గౌస్ ఆలం విచారణకు ఆదేశించారు.

రంగంలోకి దిగిన పోలీసులు..

ఈ ఘటనకు సంబంధించి టూటౌన్ పోలీసులు రంగంలోకి దిగి కూపీ లాగుతున్నారు. ఎంతమంది బాధితులు ఉన్నారనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఘరానా మోసగాడిపై కేసు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు. కేసుకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాలని ఎస్పీ డీఎస్పీని ఆదేశించారు. దీంతో టూటౌన్ పోలీసులు విచారణ మొదలుపెట్టారు. పట్టణానికి చెందిన ఏడుగురు బాధితులు రూ.33లక్షలు ఇచ్చినట్లు తేల్చారు. వడ్డీ వ్యాపారం పేరుతో తమను మోసగించినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, మరో ముగ్గురు మహిళలు తమవద్ద కూడా డబ్బులు తీసుకున్నాడని, అడిగితే చంపేస్తానని బూతులు తిడుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి చిట్టీలు, వడ్డీ వ్యాపారం పేరిట డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడినట్లు పలువురు ఫిర్యాదు చేసినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. విచారణ కోసం టూటౌన్ పోలీసులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద చిట్టీలు వేసి మోసపోవద్దని సూచించారు.

కళ తప్పిన 'మత్తడివాగు'



గత వానాకాలంలో వానలు బాగా కురియడంతో మత్తడివాగు ప్రాజెక్ట్‌లోకి నీరుచేరి నిండుకుండలా మారింది. ప్రస్తుతం వేసవి ప్రారంభంలోనే నీరు లేక ప్రాజెక్ట్ వెలవెలబోతోంది. తాంసి మండలంలోని మత్తడివాగు ప్రాజెక్ట్ చిత్రమిది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

వీధి దీపాలు ఆర్పేదెప్పుడో..?


వెలుగుతున్న వీధి దీపం

నిర్మల్‌టౌన్: భవిష్యత్ తరాల కోసం విద్యుత్‌ను పొదుపు చేయాలని చెబుతున్నప్పటికీ అధికారుల తీరు అందుకు విరుద్ధంగా ఉందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ ప్రాంతంలో వీధి దీపాలు ఉదయం 10గంటల వరకు కూడా వెలుగుతుండడంతో ప్రజాధనం వృథా అవుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు దత్తాత్రేయ ప్రతిష్ఠాపనోత్సవం


ఆలయ ప్రాంగణంలో హోమం

నిర్మల్: జిల్లా కేంద్రంలోని దత్తాత్రేయనగర్‌లో నూతన ఆలయం, దత్తాత్రేయ, ఇతర దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం కాలనీవాసులు, భక్తులతో హోమం నిర్వహించారు. సాయంత్రం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి ప్రవచనం కొనసాగింది. ఉత్సవాల్లో ప్రధానమైన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం గురువారం వేకువజామునే ప్రారంభం కానుంది. హంపీ పీఠాధిపతి చేతుల మీదుగా ఈ ఉత్సవం సాగనుంది. మహాగణపతి పూజ, యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ ద్రుక్‌బలి, మహాపూర్ణహుతి, కుంభాభిషేకం, సాయంత్రం ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కల్యాణోత్సవం, పల్లకిసేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నల్ల పోచమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి


ఇంద్రకరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌లోని నల్ల పోచమ్మను బుధవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్ ఉన్నారు.

'బీజేపీని చిత్తుగా ఓడించాలి'

నిర్మల్‌టౌన్: బీజేపీని చిత్తుగా ఓడించి, దేశ ఐక్యతను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కలవేన శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. దేశంలో ప్రతిపక్షాలను ఎన్నికల్లో పాల్గొనకుండా వారిని అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మతాలను రెచ్చగొట్టి ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నాయకులు పద్మకుమారి, ఉపాలి, మసూద్ ఉన్నారు.

దొడ్డికొమురయ్య జయంతి


కుంటాల: పూలమాల వేస్తున్న సభ్యులు

కుంటాల: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని మండలంలోని అంబకంటి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఆ సంఘ సభ్యులు పోతన్న, కోనేరు పోతన్న, శ్రీనివాస్, మల్లేష్, భోజన్న పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని తర్లపాడ్, కొత్తపేట్ గ్రామాల్లో దొడ్డి కొమురయ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య పోరాట పటిమను నాయకులు కొనియాడారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు అమరగొండ మల్లేశ్, దాసరిగొండ మల్లయ్య, ఏనుగుల రాజేశ్వర్, బైరి రాజన్న, సిగ్గుల రాజేశ్వర్, బీర్ల నర్సయ్య, పెద్ది నర్సయ్య, పెద్ది రాజన్న, జక్కుల బీరయ్య, మేకల నర్సయ్య, పెద్ది మల్లేశ్, ఎగుర్ల మహేశ్ ఉన్నారు.

ఛత్రపతి శివాజీ వర్ధంతి

కుంటాల: ఛత్రపతి శివాజీ సేవలు మరువలేనివని ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. శివాజీ వర్ధంతి సందర్భంగా బుధవారం కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. 16ఏళ్ల వయస్సులోనే స్వరాజ్యం స్థాపించాలని సంకల్పించిన మహానీయుడు శివాజీ అని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తుప్పపట్టిపోతున్న నల్లా


నీరు విడుదల చేయగానే సీసీరోడ్డులో ఇలా..


పైపు పగిలిపోవడంతో కాలనీలో నీరు

'భగీరథ' నీరందేనా..?

- చర్చితండాకు చేరని భగీరథ నీరు
- ఇళ్లలోకి వెళ్లే నల్లా కనెక్షన్లన్నీ లీకేజీలే
- తాగునీటికి బోరుబావులే ఆధారం

సారంగపూర్: అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా మారింది మండలంలోని చర్చితండా పరిస్థితి. గ్రామంలో తాగునీటి అవసరాలు తీర్చడానికి మిషన్ భగీరథ పథకంలో భాగంగా తాగునీటి ట్యాంకు నిర్మించి ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చినా ఎక్కడికక్కడ పైపులైన్ల లీకేజీలు, నల్లా కనెక్షన్లకు అమర్చిన పైపులు పగిలి తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పొరపాటున ట్యాంకులోకి నీరు చేర్చి నల్లాలు వదిలితే గ్రామం మొత్తం లీకేజీ నీటితో తడిచిపోయే పరిస్థితి. గ్రామంలో మొత్తం 42వరకు కుటుంబాలు ఉన్నాయి. వీరి అవసరాలకు అనుగుణంగా గ్రామంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా రూ.10లక్షల నిధులతో ఆరేళ్ల క్రితం 20కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంకును నిర్మించారు. దాదాపు గ్రామంలోని 40 కుటుంబాలకు నల్లా కనెక్షన్లు అమర్చారు. కానీ ట్యాంకు నిర్మించి నల్లాలు వేయించిన కొన్నాళ్లు మాత్రమే దాని నుంచి మిషన్ భగీరథ నీరు ఇళ్లకు చేరింది. ఆ తర్వాత పైపులైన్ల లీకేజీలు, నల్లా కనెక్షన్లు అస్తవ్యస్తంగా మారడం వల్ల అప్పటి నుంచి గ్రామస్తులు మిషన్ భగీరథ నీటికి దూరమయ్యారు.

సీసీరోడ్ల నిర్మాణంతో...

గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణంలో భాగంగా ప్రధాన రహదారులను చదును చేసే క్రమంలో పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడ్డాయి. అనంతరం సీసీరోడ్లు వేశాక నీటిని విడుదల చేస్తే ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఏర్పడటంతో వాటిని సవరించే అవకాశం లేకుండాపోయింది. ఇందుకు కారణం పైప్‌లైన్ పైనే సీసీరోడ్లు నిర్మించడమే.


అలంకారప్రాయంగా తాగునీటి ట్యాంకు

ఇక అప్పటి నుంచి తాగునీటి ట్యాంకు ద్వారా నీటి విడుదల నిలిచిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు కొంతమంది గ్రామస్తులు వ్యక్తిగతంగా బోరుబావులు వేయించుకోగా, మరికొంత మంది ఆర్థిక స్థోమత లేనివారు బోరుబావుల యజమానులకు నెలకు కొంత డబ్బులు చెల్లించి నీటిని వినియోగించుకుంటున్నారు. ఇటీవల కొంతమేర తాగునీటి సమస్య ఉత్పన్నమవడంతో పంచాయతీ అధికారులు గ్రామంలో ఒక బోరు బావికి చేతిపంపు, విద్యుత్ మోటారు రెండు ఒకే దానికి బిగించారు. కరెంట్ లేని సమయంలో చేతిపంపు, కరెంటు ఉన్న సమయంలో మోటార్ ద్వారా నీరందించే ఏర్పాటు చేశారు. మండు వేసవిలో బోరుబావులు ఇంకిపోయి భూగర్భ జలాలు అడుగంటితే తమకు తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతాయని, అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి మిషన్ భగీరథ నీటిని అందించాలని వేడుకుంటున్నారు.

ఎక్కడపడితే అక్కడే లీకేజీలు



తాగునీటి ట్యాంకు నుంచి వేయించిన పైప్‌లైన్లతో పాటు ఇళ్లకు వేయించిన నల్లాల కనెక్షన్లకు ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఏర్పడ్డాయి. ఒకవేళ ట్యాంకు ద్వారా పొరపాటున నీరు వదిలితే గ్రామంలో ఎక్కడ చూసినా లీకేజీలే కనిపిస్తాయి. అధికారులు వెంటనే లీకేజీలను అరికట్టి తాగునీరందించే ఏర్పాట్లు చేయాలి.
– అరవింద్, గ్రామస్తుడు

మరమ్మతులు చేపడుతాం

గ్రామంలో పైప్‌లైన్ లీకేజీలు ఉన్నమాట నిజమే. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికి గ్రామంలో బోరుబావులకు మరమ్మతులు చేపట్టాం. లీకేజీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే మరమ్మతులు చేపట్టే ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేశాం.
– ప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సారంగాపూర్

'కాంగ్రెస్ పాలనలోనే శరవేగంగా అభివృద్ధి'


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి సాగుతోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు, నాయకులు గాజుల గంగన్న, బిక్కి చిన్నరాజన్న, విలాస్, వసంత్‌రావు, దొనికేని గణేశ్, బల్గం బీమన్న, తదితరులు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు దయానంద్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, తోట సత్యం, జంగిలి శంకర్, గుగ్లావత్ రాజేందర్ నాయక్ ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు


కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

సోన్: మండలంలోని గంజాల్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరినట్లు మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి తెలిపారు. వీరు మాట్లాడుతూ మండలంలోని గంజాల్ మాజీ ఉపసర్పంచ్ గంట దరుంభాయ్, ముత్తన్న, సోన్ మండల కో ఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్, వార్డు సభ్యులు వెంకట రమణలకు నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తన నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, మాధాపూర్ మాజీ సర్పంచ్ రాజనర్సింహారెడ్డి ఉన్నారు.

రాజ్యాంగ రక్షణయాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నా.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలన్నా.. రాజ్యాంగ రక్షణ యాత్ర తప్పనిసరి నిర్వహించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బేర తిరుమలేశ్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో రాజ్యాంగ రక్షణయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం వంటి మూలస్తంభాలుగా భారత రాజ్యాంగాన్ని బీఆర్ అంబేద్కర్ రూపొందించారన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పాలనలో రాజ్యాంగంలోని మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసం అవుతున్నాయన్నారు. ప్రస్తుతం జీవించే హక్కు మాట్లాడే స్వేచ్ఛ హక్కులు కోల్పోతున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు మేస సతీశ్, నాయకులు రానమల్ల అశోక్, నేత శ్యాంసుందర్, మద్దెల రాజన్న, మైస శ్రీనివాస్ ఉన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు


మరమ్మతులను పరిశీలిస్తున్న తహసీల్దార్

ముధోల్: మండలంలోని చింతకుంట గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన చింతకుండ తండాలో చేతిపంపు చెడిపోయి చాలరోజులు అవుతోంది. దీంతో బుధవారం తహసీల్దార్ విఠల్ చింతకుంట తండాను సందర్శించి తాగునీటి ఎద్దడి తీర్చేందుకు చేతిపంపునకు మరమ్మతులు చేయించారు. మండలంలోని ఏ గ్రామంలో కూడా నీటి సమస్య లేకుండా చూస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇక నుంచి మంచి నీటి సరఫరా నిరంతరం కొనసాగుతుందన్నారు.

రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేయాలి


మాట్లాడుతున్న రావుల రాంనాథ్

సోన్: రైతు రుణ మాఫీ రూ.2లక్షలు ఒకేసారి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకలు రావుల రాంనాథ్ బుధవారం విలేకరుల సమావేశంలో అన్నారు. మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో రావుల రాంనాథ్ మాట్లాడుతూ రైతంగా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పంటలు ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లితే ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదన్నారు. 100 రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటికీ ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. బీజేపీ రైతుల పక్షాన ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో రైతు సత్యాగ్రహ దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంతోష్, సుంకరి ముత్యం, జక్క నర్సయ్య, గంగారెడ్డి ఉన్నారు.

ముగిసిన అఖండ హరినామ సప్తాహం


ప్రవచనాలు చెబుతున్న కిషోర్ మహరాజ్

తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం బుధవారంతో ముగిసింది. ఉదయం నిర్వహించిన కాళ్యా కీర్తన కార్యక్రమంలో మహారాష్ట్రలోని అళందికి చెందిన కిషోర్ మహరాజ్ పాల్గొని భక్తులకు భక్తి మార్గంపై పలు సూచనలు ఇచ్చారు. ప్రతీ ఒక్కరు చెడు వ్యసనాలు వీడి భక్తి మార్గంలో నడవాలన్నారు. సప్తాహం కార్యక్రమాలతో ప్రజల్లో ఆధ్యాత్మికం పెరుగుతుందని వివరించారు. ఇందులో భాగంగా గ్రామానికి పలువురు భక్తులు తులసీ మాలలు ధరించారు. అనంతరం ఉట్టి పగలకొట్టి ప్రసాదం పంపిణీ చేశారు. వారం రోజులుగా కార్యక్రమంలో పాల్గొన్న మహారాజ్‌లకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక


నియామక పత్రం అందిస్తున్న రాజేశ్వర్

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కమిటీలను మండల అధ్యక్షుడు రాజేశ్వర్ ప్రకటించారు. బుధవారం మండలంలోని చామన్‌పల్లి గ్రామంలో నూతన గ్రామశాఖ ఎన్నికల్లో గ్రామ అధ్యక్షుడిగా పాకాల అతీష్, ఉపాధ్యక్షుడిగా పోచమ్మల రాము, సహాయ ఉపాధ్యక్షుడిగా పల్లికొండ భీమేష్, కార్యదర్శిగా పోచమ్మల సత్తయ్య, సహాయ కార్యదర్శిగా యానాం గంగాధర్, పోచమ్మల శశికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, యూత్ అధ్యక్షుడు నగేష్, ఈటల శ్రీనివాస్, సుదర్శన్, మల్లేష్, ఎస్టీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. చింతల్‌చాంద గ్రామ అధ్యక్షుడిగా బంథల మీద మోహన్, ప్రధాన కార్యదర్శి తాండ్ర రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా సాయన్న, కోశాధికారిగా మోతే రాజు, సంయుక్త కార్యదర్శిగా సలీమ్, బంటు శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఇందులో వొడ్నాల రాజేశ్వర్, నగేష్, ఈటెల శ్రీనివాస్, మలేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


నర్సాపూర్: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు


కుంటాల: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నర్సాపూర్ (జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో బుధవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వాహకుడు గోస్కుల భూమయ్య ప్రారంభించారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2203, కామన్ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2183 గా ప్రభుత్వ మద్దతు ధర ఉంటుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. చెన్న మహేష్, పాపెన్ రాజేశ్వర్, బొశెట్టి విజయ్ కుమార్, లంబాడి గంగాధర్, చెన్నరాజు, సాయి పాల్గొన్నారు.

కుంటాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని అధికారులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లింబా(కే) గ్రామంలో పీఏసీఎస్, ఓలాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీధర్, సెక్రటరీలు శ్రీనివాస్‌రెడ్డి, భోజేందర్, నిర్వాహకులు వెంకటేష్, లక్ష్మి కాంతం రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి

సోన్: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని జిల్లా సహకార అధికారి రిజిస్ట్రార్ డి.సాయినాథ్ అన్నారు. మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. శ్రీనివాస్, అశోక్, సాయికృష్ణ, వీడీసీ సభ్యులు సాగర్, కొండ రవి ఉన్నారు.

మద్దతు ధర..

ముధోల్: మండలంలోని బోరిగామ్, వడ్తాల్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పీఏసీఎస్ సీఈవో సాయారెడ్డి ప్రారంభించారు. రైతులు తాము పండించిన వరి దిగుబడులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి క్వింటాల్‌కి ఏ గ్రేడ్ రకంకు రూ. 2203, బి గ్రేడ్ రకానికి రూ. 2183 మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'రైతుల సమస్యలపై పట్టింపు లేదు'


మాట్లాడుతున్న సమన్వయ కమిటీ సభ్యులు

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల సమస్యలపై పట్టింపు లేదని బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు విమర్శించారు. బుధవారం పట్టణంలోని రమాదేవి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 6 న తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు దీక్ష చేపడతామన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ వంటి హామీలను గాలికొదిలేసిందన్నారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమన్వయ కమిటీ సభ్యులు లోలం శ్యామ్ సుందర్, విలాస్ గాడేవార్, కిరణ్ కొమ్రేవార్ ఉన్నారు.

పుస్తె, మట్టెలు అందజేత

కడెం: పేదింటి ఆడబిడ్డకు పుస్తె, మట్టెలు అందజేసి మరోసారి తన సేవభావాన్ని చాటాడు ఖానాపూర్ వాసి కృష్ణంరాజు. మండలంలోని లింగాపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మి బక్కన్న దంపతుల కూతురు వివాహానికి కృష్ణంరాజు (ఒకేఆర్) ఫౌండేషన్ సభ్యుల ద్వారా బుధవారం వారి తల్లిదండ్రులకు పుస్తె, మట్టెలు అందజేశారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలి

ముధోల్: జాబుకార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డీఆర్‌డీఏపీడీ విజయలక్ష్మీ అన్నారు. బుధవారం మండల కేంద్రం ముధోల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పని ప్రదేశంలో కూలీలకు అన్ని వసతులు కల్పించాలని, ఎండ వేడిమి నేపథ్యంలో ఉదయం 6 గంటల నుండి 10గంటల వరకు మాత్రమే పని కల్పించాలన్నారు. జాబ్‌కార్డు లేని వారికి వెంటనే జాబ్‌కార్డు కల్పించాలని సూచించారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే


వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

ముధోల్: ముధోల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జరిగిన వివాహ వేడుకలకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ హాజరయ్యారు. సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈయన వెంట మాజీ జెడ్పీటీసీ లక్ష్మినర్సాగౌడ్, బాసర జెడ్పీటీసీ సాల్వీ రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భైంసా కోర్టులో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో జడ్జి, ఏఎస్పీ, న్యాయవాదులు

భైంసాటౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. న్యాయవాది గడపాలే శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విందులో జడ్జి దేవేంద్రబాబుతో పాటు ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, న్యాయవాదులు కోర్టు సిబ్బంది ఉన్నారు.

ఎండకు రక్షణగా గ్రీన్ మ్యాట్


నారాయణరెడ్డి మార్కెట్లో గ్రీన్ మ్యాట్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నారాయణరెడ్డి మార్కెట్లో ఎండ నుంచి రక్షించుకునేందుకు గ్రీన్ మ్యాట్‌ను ఏర్పరుచుకున్నారు. దుకాణదారులందరూ సమిష్టిగా డబ్బులు వేసుకుని వాటిని ఏర్పాటు చేశారు. కస్టమర్లకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించడానికి ఇవి ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

తాగునీటి ఎద్దడి శాశ్వత పరిష్కారానికి కృషి


తాగునీటి పైప్‌లైన్ ప్రారంభిస్తున్న చైర్మన్

ఖానాపూర్: పట్టణంలో తాగునీటి ఎద్దడి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలో డబుల్‌బెడ్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు చేయించి బుధవారం నుంచి నీటి సరఫరాను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కిశోర్‌నాయక్, షబ్బీర్‌పాషా, జన్నారపు శంకర్, పరిమి సురేశ్, తదితరులున్నారు.